

మెళియాపుట్టి మండలం కొండపై ఉన్న గొట్టిపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన టవర్

●షెడ్యూల్ విడుదల ● వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్
● పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ● మార్చి 3న ఓట్ల లెక్కింపు
● ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో సుమారు 23 వేల మంది ఓటర్లు
●అమలులోకి ఎన్నికల కోడ్ ●శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్

27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక



విశాఖపట్నం/శ్రీకాకుళం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ కానున్నది. పదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ మరుసటి రోజున నామినేషన్లు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ తుదిగడువు. వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో స్కూలు అసిస్టెంట్లు, అంతకంటే పైకేడర్ అంటే హెచ్ఎంలు, జూనియర్, సీనియర్ లెక్చరర్లు, వర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో సెకండరీ విద్య బోధన చేసే టీచర్లు ఓటర్లుగా ఉంటారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు గత ఏడాది సెప్టెంబరు 30 నుంచి అవకాశం ఇచ్చారు. నవంబరు 23న ముసాయిదా, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. తుది జాబితాలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళలు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం 4,937, పార్వతీపురం మన్యం 2,262, అల్లూరి సీతారామరాజు 1,448, విశాఖపట్నం జిల్లాలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత కూడా ఓటు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 1,000 మంది వరకు పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

అభివృద్ధి పనులకు బ్రేక్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ఈ ప్రభావం గురువారం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఉంటుంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,444 కోట్ల ప్యాకేజీపై కర్మాగారం అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఉక్కు మంత్రి అధికారికంగా ప్రకటన చేయాలనుకున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఉక్కు కర్మాగారంలో పర్యటించవచ్చునని, కానీ..హామీలు, అభివృద్ధి పథకాలపై ప్రకటన చేయరాదని అంటున్నారు. అదే విధంగా ఆంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఆ కార్యక్రమం వాయిదా పడింది. సుమారు ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికార పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

గిరి శిఖరాల్లో.. హలో.. హలో!

●కొండలపై గ్రామాల్లో సెల్‌టవర్లు ●తీరనున్న మొబైల్ సిగ్నల్ సమస్యలు

మెళియాపుట్టి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ముందుగా రహదారులు నిర్మించింది. సాంకేతికంగా కూడా గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. సిగ్నల్ సమస్యలు లేకుండా కొండలపై గ్రామాల్లో సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని భావించారు. దీనిపై ఇటీవల కేంద్రానికి నివేదిక పంపారు. దీంతో కొండలపై ఉన్న గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ కోసం వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మండలాల వారీ పరిశీలిస్తే.. సీతంపేటలో 42, మెళియాపుట్టిలో 15, నందిగాంలో 4, భామిని, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, మందస, టెక్కలి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 67 టవర్లు మంజూరు చేశారు. అధికంగా బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. వీటి ఏర్పాటు పూర్తయిందని, పీఎం నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభిస్తారని వెల్లడించారు. కాగా.. గతంలో నెట్‌వర్క్ లేక సాంకేతిక సమస్యతో అధికారులు ఇబ్బందులు పడేవారు. పింఛన్లు, రేషన్ కావాలంటే లబ్ధిదారులు కొండపై నుంచి ఆపసోపాలు పడి కిందకు దిగివచ్చి తీసుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తుండడంతో తమకు ఇబ్బందులు తప్పనున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ప్రతిరోజూ రెండు ప్రైవేట్ బస్సులు నడుస్తుంటాయి. ఒకటి విజయవాడ-పాతపట్నం, మరోకటి హైదరాబాద్-పాతపట్నం రూట్లలో తిరుగుతుంటాయి. అయితే, ఈ రెండు బస్సులకూ ఒకటే నెంబర్ ఉంది. ఒకటి నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌తో, మరోకటి ఛత్తీస్‌గఢ్ రిజిస్ట్రేషన్‌తో గత కొంతకాలంగా నడుస్తున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● హడ్డుబంగి-విశాఖపట్నం మార్గంలో పదుల సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో కొన్ని కాంట్రాక్టర్ క్యారియర్ అనుమతులతో ప్రయాణికులను రవాణా చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల రిజి స్ట్రేషన్, అనుమతులతో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



బస్సులు రెండు.. నెంబరు ఒకటే..

● ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యం
● జిల్లాలో పుట్టగొడుగుల్లా సర్వీసులు
● ప్రభుత్వ ఆదాయానికి గండి
● అధికార పార్టీ నేతల అండదండలు
● చోద్యం చూస్తున్న అధికారులు

ఆమదాలవలస, జనవరి 29(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రైవేటు బస్సులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రెండు, మూడు బస్సులకు ఒకే నెంబరు ఉంటుంది. కాంట్రాక్టర్ క్యారియర్ అనుమతులతో ప్రయాణికులను ఎక్కించుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాయి. రవాణా శాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పాతపట్నం నుంచి విజయవాడకు రెండు ప్రైవేట్ బస్సులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం పాతపట్నం, బత్తిలి, కొత్తూరు, హడ్డుబంగి ప్రాంతాల నుంచి సుమారు 30 ప్రైవేటు బస్సులు ప్రతిరోజూ హైదరాబాద్, విశాఖ, విజయవాడ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజురోజుకూ ప్రైవేటు ట్రావెల్స్ సంఖ్య పెరుగుతుండ డంతో ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ ఏర్పడుతుంది. ముఖ్యంగా అలికాం-బత్తిలి రహదారిపై ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇరువైపులా వచ్చిపోయే బస్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ప్రధాన కూడళ్ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవడానికి ఎక్కువ సమయం బస్సులను నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్పందించని అధికారులు..

ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రైవేటు బస్సులను పోలీసులు, రవాణాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎంతసేపూ బస్సుల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాలను తరలిస్తున్నారా? లేదా? అని తనిఖీలు నిర్వహిస్తున్నారే తప్ప ఏ రోజైనా బస్సుకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించిన దాఖలాలు లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇతర రాష్ట్రాల పేరుతో రిజిస్ట్రేషన్లు, ఒకే నెంబర్‌తో నడుస్తున్న బస్సులపై, కాంట్రాక్టర్ క్యారియర్ అనుమతులతో పాసింజర్ సర్వీస్ చేస్తున్న ట్రావెల్స్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇటీవల సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ వద్ద విశాఖపట్నం వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సును పోలీసులు ఆపారు. ఆ బస్సు కాగితాలను పరిశీలించగా కాంట్రాక్టర్ క్యారియర్‌గా అనుమతులు ఉన్నాయి. కానీ, పాసింజర్ సర్వీసుగా తిరుగుతుండడంతో బస్సును కొద్దిసేపు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులందరూ వివిధ అవసరాలపై వెళుతున్నామని, ఏదైనా ఉంటే తర్వాత విచారించాలని పోలీసులను కోరడంతో అక్కడ నుంచి బస్సును పంపించేశారు. ఇదే విధంగా సుమారు ఆరు బస్సులు తప్పుడు ధ్రువపత్రాలతో ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి విశాఖపట్నంకు ప్రతిరోజూ ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పందించి ఇలాంటి బస్సులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్రహింసలకు గురిచేశారు

●ఆన్‌లైన్‌లో ఉద్యోగం ప్రకటనను నమ్మి మోసపోయాను
●థాయ్‌లాండ్ వెళ్లి అక్కడి నుంచి బర్మా తీసుకెళ్లారు
●అక్కడ సైబర్ నేరాలు చేయించేవారు
●ప్రభుత్వ విప్ ఎదుట ఇచ్ఛాపురం యువకుడి ఆవేదన
●రామ్మోహన్, అశోక్ సహకారంతో బయటపడ్డానని వెల్లడి



విప్ అశోక్‌తో కలిసి మాట్లాడుతున్న మణికంఠ, గ్రామస్థులు

కవిటి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగమనే ప్రకటన చూసి వెళ్లారా? అంతే జీవితాన్ని నాశనం చేసుకున్నట్టే. అక్కడికి వెళ్లి బైటకు రావాలంటే బతుకుమీద ఆశలు దాదాపు వదులు కోవాల్సిందే. ఇలాంటి ఘటన ఇచ్ఛాపురంలోని బెల్లుపడకు చెందిన ఒక యువకునికి ఎదురైంది. ఇదే విషయాన్ని బుధవారం రామయ్యపుట్టుగలోని ప్రభుత్వ విప్ బి.అశోక్ సమక్షంలో విలేకరులకు తన బాధను వెల్లడించాడు. బెల్లుపడకు చెందిన బచ్చు మణికంఠ గత ఏడాది మేనెలలో ఆన్‌లైన్ ద్వారా డేటాఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలనే ప్రకటన చూశాడు థాయ్‌లాండ్‌లోని ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. పాసుపోర్టు రెడీ చేసుకుని థాయ్‌లాండ్‌కు వెళ్లి అక్క దిగాడు. వెంటనే సదరు కంపెనీ డ్రైవరునంటూ ఓ వ్యక్తి వచ్చి కారులో తీసుకువెళ్లాడు. అక్కడనుంచి మణికంఠను మరోవ్యక్తికి అప్పగించటంతో వారు బర్మా బోర్డరు దాటించి మయన్మార్ వరకు తీసుకువెళ్లాడు. అక్కడ మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగానున్న రెబల్ ఆర్మీ అంటూ వారి చేతికి మణికంఠను అప్పగించాడు. అక్కడున్న కొందరు రెబల్ ఆర్మీ ఆధ్వర్యంలో కంపెనీ ఉందని నమ్మించి అక్కడకు వెళ్లాక తన వస్తువులన్నీ తీసుకుని ఓభవనంలోకి తీసుకువెళ్లారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగమని చెప్పి ఇతరదేశాల యువకులను ఇక్కడకు రప్పించి ఫ్రాడ్‌కాల్స్, క్రిప్టోకరెన్సీ పేరిట సైబర్‌నేరాలు చేయించుకుంటున్నారు. మణికంఠకు ప్రతీరోజూ టార్గెట్‌లు ఇచ్చి ఇరాక్, శ్రీలంక, ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేష్, దుబాయ్ వంటి దే శాల యువకులకు మెసేజ్‌లు చేసి వారి వాట్సప్‌నెంబర్లు తెలుసుకుని వారితో చాటింగ్ చేయాలని బెదిరించే వారు. వారి మోసం చేసి సొమ్ములు రాబట్టుకోవడం వీరి పని. ఒక్కోసారి మాట వినని వారిని చిత్రహింసలకు గురిచేసేవారు. కునుకుతీసినా వాటర్‌ప్రెజర్‌తో హింసించటం లేకుంటే విద్యుత్ షాక్‌లు ఇవ్వటం, నిల్చోబెట్టి చేతులు పైకిఎత్తి ఉంచి లాక్‌లు వేయటం చేసేవారు. కనీసం తన తల్లిదండ్రులతో మాట్లాడాలన్నా అవకాశం ఇవ్వలేదని మణికంఠ వాపోయాడు. ఈ తరుణంలో మిత్రుడి సాయంతో తన తల్లిదండ్రులు ఎమ్మెల్యే అశోక్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును సంప్రదించారని, వారి సహకారంతో ఇటీవల గ్రామానికి చేరుకున్నానని మణికంఠ తెలిపాడు. తనలా ఎవరూ మోసపోకూడదని చెబుతున్నాడు.

అప్రమత్తంగా ఉండాలి

ఉద్యోగాల పేరుతో విదేశాలకు వలస వెళ్లే యువత చాలా అప్రమత్తంగా ఉండాలి. తాము వెళ్లే దేశం, కంపెనీ వివరాలను స్థానికంగా ఆర్డీవో స్థాయి అధికారితో నిర్ధారణ జరిగిన తర్వాతనే అక్కడకు వెళ్లాలి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి అత్యధికంగా ఉపాధి కోసం విదేశాలకు వెళ్తుంటారు. ఇలాంటి వారు ఏ ఏజెంట్, ఇనిస్టిట్యూట్ ద్వారా వెళ్తున్నారో సరైన సమాచారం స్థానిక పోలీసులకు ఇవ్వాలి. లేదంటే కొన్నిసార్లు వారు ఎక్కడ ఉన్నారో ఎంబసీలోనూ తెలియదు.

-బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

వ్యాక్సిన్ వేశారు.. సూది మరిచారు

● టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఏఎన్ఎం నిర్లక్ష్యం
● నాలుగు రోజుల తరువాత గుర్తించిన శిశువు తల్లిదండ్రులు



బిడ్డతో తల్లి కల్పన



శిశువు తొడలో తల్లిదండ్రులు గుర్తించిన సూది

టెక్కలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు వ్యాక్సిన్ వేసిన తరువాత సూది తీయడాన్ని మరిచిపోయింది ఓ మేటీ అసిస్టెంట్ (ఏఎన్ఎం). దీంతో నాలుగు రోజుల పాటు ఆ శిశువు తొడకే సూది ఉండిపోయింది. తరువాత గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చోటుచేసుకుంది. సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడు గ్రామానికి చెందిన తిరుమరెడ్డి కల్పన అనే గర్భిణి ఈనెల 24న టెక్కలి ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. మూడున్నర గంటల తరువాత ఆ శిశువుకు మేటీ అసిస్టెంట్ లక్ష్మి హెపటైటిస్-బి ఫస్ట్‌డోస్ వేసింది. ఆ తరువాత బిడ్డతో పాటు కల్పన ఇంటికి చేరుకుంది. నాలుగు రోజుల తరువాత బిడ్డకు స్నానం చేసేందుకు సిద్ధం చేయగా తొడ వాచిపోయి ఉండడాన్ని తల్లిదండ్రులు గమనించారు. మరింత లోతుగా పరిశీలించగా వ్యాక్సిన్ వేసిన ప్రాంతంలో సూది కనిపించింది. దీంతో హుటాహుటిన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకున్నారు. ఇలాగే వ్యాక్సిన్ వేస్తారా అని సిబ్బందిని నిలదీశారు. వ్యాక్సిన్ వల్ల తొడ వాసింది అనుకున్నామే తప్ప అందులో సూది ఉందని మొదటి మూడురోజులు గుర్తించలేకపోయామని ఆ శిశువు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావును వివరణ కోరగా.. 'నా దృష్టికి విషయం వచ్చింది. సంబంధిత మేటీ అసిస్టెంట్ లక్ష్మిని పిలిచి వివరణ కోరాను. తాను ఎంతోమంది పిల్లలకు వ్యాక్సిన్ వేస్తుంటానని, అలా సూది మర్చిపోవడం ఎప్పుడూ జరగలేదని ఆమె చెబుతుంది' అని తెలిపారు.



లండ రవి కుటుంబం (ఫైల్)

గుజరాత్‌లో ముగ్గురు జిల్లా వాసులు మృతి

● గ్యాస్ మంటలు వ్యాపించి దుర్ఘటన
● స్వగ్రామం ఒంకులూరులో విషాదఛాయలు

8లో

గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

6లో

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్

6లో

పట్టుదలతో చదివితే.. పాస్

● పక్కా ప్రణాళిక అవసరం
● ఒత్తిడికి గురి కావద్దు
● పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచన

6లో



పట్టుదలతో చదివితే.. పాస్



● పక్కా ప్రణాళిక అవసరం ● ఒత్తిడికి గురి కావద్దు ● పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచన

నరసన్నపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి జీవితంలో అత్యంత ముఖ్యమైనది పదో తరగతి. ఉన్నత విద్యకు బాటలు వేసేది... భవిష్యత్తును నిర్ణయించేది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు. ఈ ఏడాది పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో విజేతగా నిలిచి... మంచి భవితకు పునాది వేసుకునేందుకు ఇంకా మిగిలింది దాదాపు 45 రోజులు. ఈ కొద్ది రోజులు ఎంతో కీలకం. సిలబస్ మారినందున విదార్థులు అవగాహనతో.. ప్రణాళికాయుతంగా చదవాల్సిన అవసరం ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి లేకుండా చదవాలని మరోవైపు వైపు వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు విద్యార్థులు ఏం చేయాలో... ఎలా చదవాలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు సూచనలు.. సలహాలు ఇస్తున్నారు.

ఆందోళన వద్దు..



పదో తరగతి విద్యార్థులు ఆందోళనకు దూరంగా ఉండాలి. పరీక్షలు పూర్తయ్యేంత వరకు తేలికగా జీర్ణమయ్యే బలమైన పోషకాహారం ఇవ్వాలి. రాత్రి ఏడు గంటల పాటు నిద్ర పోవాలి. ఉదయాన్నే లేచి చదవడం చాలా మంచిది.

-పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి,కోటబొమ్మాళి

తెలుగు

అవగాహనతో సులభంగా మార్కులు..



తెలుగులో మొత్తం మూడు విభాగాలుంటాయి. మొదటిది 32, రెండుకు 36, మూడుకు 32 మార్కులు కేటాయిస్తారు. మొదటి భాగంలో అవగాహన, ప్రతిస్పందనలో నాలుగు ప్రశ్నలు 32 మార్కులకు ఇస్తారు. ఒకటి, మూడు, 9వ పాఠాల్లోని కంద, ఆటవెలది, తేటగీతి పద్యాల్లో రెండు ఇస్తారు. భావాన్ని అర్థం చేసుకుని సమాధానం రాయాలి. రెండో విభాగం వ్యక్తీకరణ, సృజనాత్మకత, పద్యభాగంలోని కవుల్లో ఒకరిని ఇచ్చి పరిచయం చేయమంటారు. గద్య భాగం నుంచి ప్రక్రియ లేదా నేపథ్యాన్ని రాయాల్సి ఉంటుంది. రామాయణం నుంచి పాత్ర స్వభావం ఒకటి రాయాలి. విభాగం మూడులో భాషాంశాలపై ప్రశ్నలు వస్తాయి. అలంకారం, ఛందస్సు పర్యాయపదాలు, నానార్థాలను చదివితే సరిపోతుంది.

-పి.వాసుదేవరావు, తెలుగు పండిట్, జడ్పీ ఉన్నత పాఠశాల (బోర్డు), నరసన్నపేట

హిందీ

మంచి దస్తూరితో శతశాతం ..



హిందీకి సంబంధించి గత ప్రశ్నపత్రంతో పోలిస్తే ఇప్పుడు ఇవ్వబోయేది ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది. ప్రశ్నపత్రంలో మొత్తం 6 విభాగాలు ఉంటాయి. మొదటి భాగంలో వ్యాకరణాంశాలు, రెండులో నాలుగు ప్రశ్నలను జాగ్రత్తగా అర్థం చేసుకొని రాస్తే 20 మార్కులు సాధించవచ్చు. వీటిలో పేరాగ్రాఫ్‌లు, వాటి కింద ప్రశ్నలు అడుగుతారు. మూడో భాగంలో ప్రాచీన కవి లేదా ఆధునిక కవి గురించి రాయవలసి ఉంటుంది. మీరాబాయి, కబీర్‌దాస్‌ల గురించి బాగా చదివితే సరిపోతుంది. సీతారాం సేక్సరియా పాఠ్యాంశం ముఖ్యమైనది. నాలుగో భాగంలో 8 ప్రశ్నలు ఇస్తారు. ఆరింటికి సమాధానం రాయాలి. మూడు పద్యభాగం, మూడు గద్య భాగం నుంచి ఉంటాయి. 19వ ప్రశ్న చాకీ పద్యం నుంచి మొదటి నాలుగు పద్యాలు చదివితే సరిపోతుంది. ఐదో భాగంలో మీరాబాయి సారాంశం, బడే బహ సాహెబ్ పాఠాల సారాంశం చదువుకుంటే సులభంగా 16 మార్కులు తెచ్చుకోవచ్చు. ఆరో భాగంలో చుట్టీ పత్ర్, పితాజీకో పత్ర్, మిత్రకో పత్ర్ లేఖలు మీద ఎక్కువ శ్రద్ధ చూపించాలి. వ్యాసాల్లో ఈ ఏడాది పది మార్కులకు కేటాయించారు. పర్యావరణ ప్రదూషణ్, ఆదర్శ్ విద్యార్థి, పండుగల గురించి చదవడం శ్రేయస్కరం. మంచి దస్తూరితో వంద శాతం మార్కులు సాధ్యం.

-ఇమిడిశెట్టి సంతోష్ కుమార్, హిందీ పాఠ్యపుస్తక రచయిత, జడ్పీ ఉన్నత పాఠశాల, సుందరాపురం

గణితం

సాధనతో సులభం ..



గణితం అంటే విద్యార్థుల్లో ముందుగా భయం లేకుండా ఉండాలి. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేస్తే గణితంలో ఉత్తీర్ణత కష్టమేమీ కాదు. సి, డి, గ్రేడ్ విద్యార్థులు బ్లూప్రింట్‌ను గమనించి సులభమైన చాప్టర్లను ఎక్కువసార్లు అభ్యాసం చేస్తే మార్కులు సులభం. కరణులు, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, గ్రాఫ్ పూర్తిగా నేర్చుకోవాలి. బహుపదులు, శూన్యవిలువలు కనుగొనుట, మూలాల స్వభావం, కోఆర్డినేట్ జామెట్రీలో మధ్య దూరం, బిందువు కనుగొనుట, త్రికోణీయ నిష్పత్తుల పాఠాలను ప్రత్యేకంగా చదవాలి.

-బుద్దల కేశవరావు, జడ్పీ ఉన్నత పాఠశాల, సత్యవరం

జీవ శాస్త్రం

బొమ్మలపై దృష్టి పెట్టాలి..



జీవశాస్త్రం ఎంతో సులభమైనసబ్జెక్టు. సైన్స్‌లో రెండో పేపర్‌గా ఉంటుంది. మొత్తం 50 మార్కుల్లో అత్యధికంగా పొందడానికి వీలుంది. ఇందుకుగాను మానవ విసర్జక, పుష్ప నిర్మాణం, మానవ, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మానవ లింగ నిర్ణయం చిత్రాలు బాగా సాధన చేయాలి. కిరణజన్య సంయోగక్రియకు కార్బన్ డయాక్సైడ్ అవసరం, పిండి పదార్థాలపై లాలాజల చర్య, రైజోపస్ ప్రయోగాలను వివరంగా తెలుసుకోవాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. భేదాలు, కారణాలు, నిర్వచనాల ప్రశ్నలను సాధన చేయాలి. డయాగ్రంల సాధన, ఫ్లో చార్ట్ గుర్తు పెట్టుకోవడం అవసరం.

-ఎన్. లీలారాణి, ఎన్ఎస్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, అంపోలు

భౌతిక శాస్త్రం

చిన్న చిట్కాలు పాటిస్తే చాలు..



అర్థం చేసుకుంటే భౌతిక శాస్త్రంలో మార్కులు చాలా సులభం. బ్లూప్రింట్, మార్కులు వెయిటేజ్ ఆధారంగా చదివితే 50కి గరిష్ఠంగా 40.. ప్రతి పాఠాన్ని క్షుణ్ణంగా చదివి కీలక అంశాలు నేర్చుకుంటే 50కి 50 మార్కులు సాధించవచ్చు. మొత్తం 17 ప్రశ్నలు ఉంటాయి ఒకటి నుంచి 8 వరకు ఒక మార్కువి, 9, 10 11కు రెండు 12, 13, 14కు నాలుగు, చివరి మూడు ప్రశ్నలు 8 మార్కులవి ఉంటాయి. భౌతిక శాస్త్రంలో నాలుగు, రసాయన శాస్త్రంలో నాలుగు పాఠాలు ఉన్నాయి. ఛాయిస్‌తో కలుపుకొని ఫిజిక్స్ నుంచి 39 మార్కులకు, కెమిస్ట్రీ నుంచి 39 మార్కులకు ప్రశ్నలిస్తారు. చాయిస్ 28 మార్కులకు మినహాయిస్తే మిగిలిన 50కి పరీక్ష రాయాలి. ఇందుకు పాఠ్యాంశాల్లో దృష్టి లోపాలు, ఎండమావులు, ఇంద్రధనుస్సు ఏర్పడే విధానం, విద్యుత్తు, డీసీ జనరేటర్ పనిచేసే విధానం, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, కెమికల్ రియాక్షన్, ఆమ్లాలు, క్షారాలు, ఈక్వేషన్స్, మెటల్స్, నాన్ మెటల్స్ పాఠాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యమైన బొమ్మలపై దృష్టి పెట్టాలి... బాగా గీసే నైపుణ్యం పెంపొందించుకోవాలి.

-సింహాద్రి, సాయిశ్రీనివాస శర్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట

సాంఘిక శాస్త్రం

సమాచారం.. నైపుణ్యాలపై పట్టు అవసరం..



అర్థం చేసుకొని సమధానాలు రాయగలిగితే సాంఘిక శాస్త్రంలో నూటికి నూరు మార్కులు సాధించవచ్చు. నాలుగు విభాగాల్లో మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయి. భూగోళం శాస్త్రం 23, చరిత్ర 23, పాలిటిక్స్ 23, ఆర్థిక శాస్త్రం 23, మ్యాప్ పాయింట్‌కు 8 మార్కులు కేటాయిస్తారు. జవాబులను ఉప శీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్)తో రాయాలి. అడిగిన ప్రశ్నకు జవాబులు సూటిగా రాస్తే దిద్దేవారికి మంచి అభిప్రాయం కలుగుతుంది. సమాచారం, నైపుణ్యాల ప్రశ్నలు పట్టిక రూపంలో లేదా గ్రాఫ్‌లో పొందుపరచి ఇస్తారు. సమాధానం రాయడం సులువే. నిత్యజీవితంలో మనకు తారసపడే వాటితో పోలుస్తూ గుర్తుంచుకుంటే మ్యాప్ పాయింట్ సులువు. ఇలా రాయడం ద్వారా నూటికి నూరు మార్కులు పొందవచ్చు.

-కింజరాపు లక్ష్మణరావు, సోషల్ అసిస్టెంట్, జడ్పీ హైస్కూల్, సత్యవరం

ఇంగ్లీషు

అర్థం చేసుకొని రాయాలి..



ఇంగ్లీషుకు సంబంధించి ఈ ఏడాది ప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ప్రవేశపెట్టింది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న మార్పులతో ప్రశ్నపత్రం పాత విధానంలోనే ఉంటుంది. మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. రీడింగ్ కాంప్రెహెన్సన్‌లో ఇచ్చిన ప్రశ్నలను అర్థం చేసుకొని సమాధానాలు రాస్తే 30కి 30 మార్కులు సాధించవచ్చు. రెండో విభాగంలోని గ్రామర్, వకాబులరీలో ఎడిటింగ్‌కు సంబంధించిన వర్క్‌బుక్‌లో పాసేజెస్ సాధన చేయాలి. ఈ విభాగంలో ప్రశ్నలన్నింటికీ వరుస క్రమంలో సమాధానాలు రాయాలి. మూడోది క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్, లెటర్ రైటింగ్‌పై దృష్టి పెట్టాలి. చేతిరాత, అన్ని ప్రశ్నలకు జవాబులు, వరుస క్రమంలో రాయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

-గెద్దలవలస సత్యబాబు, ఇంగ్లీషు అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, కంబకాయి

నేడు సిక్కోలు గాంధీ మందిరం వార్షికోత్సవం



శ్రీకాకుళం కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని బలగ శాంతినగర్ కాలనీలో గాంధీ మహాత్ముడి కోసం ఒక మందిరాన్ని నిర్మించారు. అక్కడ జాతిపిత పేరుతో స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ మహాత్ముడు నిత్యం పూజలు అందుకుంటున్నారు. గాంధీజీతో పాటు మరి కొంతమంది సమర యోధులు, దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన ఎంవీవీఎస్ శాస్త్రి అనే వ్యక్తి సంకల్పంతో గాంధీ మందిరానికి పునాది పడింది. నగర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆర్థిక సాయంతో ఈ మందిరాన్ని నిర్మించారు. మరో 25 మంది స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను రూపొందించారు. శాంతి మందిరంలో ప్రశాంతంగా మౌనముద్రలో ఉన్న మహాత్ముని అతి పెద్ద విగ్రహాన్ని చూడవచ్చు. మందిరం చుట్టూ మూడు సింహాల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ స్మృతివనంలో అతిపెద్ద జెండాను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈ స్మృతి వనాన్ని 2022 జనవరి 30న ప్రారంభించారు.

మాఘ మాసం... మంచి ముహూర్తం!



కల్యాణ వేడుకలకు సిద్ధమవుతున్న వేదిక

● జిల్లాలో జోరుగా పెళ్లిళ్లు... గృహ ప్రవేశాలు

● కల్యాణ మండపాలకు డిమాండ్ ● వేదికలు దొరక్క ఇబ్బందులు

పలాస రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. శుభ మంత్రాలు వినిపించనున్నాయి. ఇళ్లు, వేదికలు మామిడి తోరణాలతో కళకళలాడనున్నాయి. వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి. కొత్త ఇళ్లు బంధువులతో సందడిగా మారనున్నాయి. రానున్న ఫిబ్రవరి, మార్చి నెలల్లో శుభ తిథులు ఉండడంతో కల్యాణాలు, గృహ ప్రవేశాలు, ఉప నయనాలు, ఇతర శుభ కార్యక్రమాలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వివాహాలు అధిక సంఖ్యలో జరగనున్నాయి. ప్రధాన లాడ్జీ లు, కల్యాణ మండపాలు, ఈవెంట్స్ సెంటర్లు బిజీగా మారనున్నాయి. ఈ నెల 30వ తేదీ నుంచి మార్చి 16వ తేదీ వరకూ ముఖ్యమైన తిథులు ఉండడంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు అధిక సంఖ్యలో జరుగనున్నాయి. ఇప్పటికే అన్ని కల్యాణ మండపాలు బుక్ అయిపోయాయి. కొత్తగా ముహూర్తాలు తీసిన వారు ప్రత్యామ్నాయ వేదికల కోసం వెతుకులాటలో ఉన్నారు. మాఘ మాసంలో జనవరి 30, 31వ తేదీలు, ఫిబ్రవరి 2, 3, 6, 7, 8, 12, 13, 14, 15, 17, 20, 21, 22, 23, 24, ఫాల్గుణ మాసంలో మార్చి 1, 3, 5, 6, 7, 11, 12, 13, 14, 15, 16 వరకూ మంచి ముహూర్తాలు ఉన్నాయి. డిసెంబరు నెల నుంచే కల్యాణాల కోసం మండపాలు, వేదికలను బుక్ చేసి ఉండడంతో అన్ని వేదికలు ఫుల్ అయిపోయాయి. కొత్త ముహూర్తాలు రానున్న ఉగాది అనంతరం తీయనుండడంతో ఈ తేదీల్లో సరైన వేదికలు దొరకని వారు కొత్త పంచాంగం కోసం వేచి చూస్తున్నారు. పెళ్లిళ్ల కోసం పురోహితులు, బాజాభజంత్రీలు, డీజేలు, వంటవారు, డెకరేషన్ల వారికి చేతినిండా పని దొరుకుతోంది. సుమారు 35 రోజుల పాటు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు జరగనుండడంతో ఇతర వ్యాపారాలు జోరుగా జరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

మంచి ముహూర్తాలు..



మాఘ, ఫాల్గుణ మాసాల్లో దివ్యమైన ము హూర్తాలు ఉన్నాయి. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, షాపుల ప్రారంభోత్సవాలకు కూడా మంచి ముహూర్తాలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉన్నాయి. ఏప్రిల్‌లో నూతన పంచాంగం సిద్ధ మవుతుండడంతో ఇప్పుడు వివాహ వేడుకలను చేయలేని వారు ఆ దివ్యముహూర్తాలలో చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

-పి.బాబూరావు, పురోహితులు, పలాస-కాశీబుగ్గ

గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



మెళియాపుట్టి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వం వచ్చిన తరువాత గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కూమార్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. 16 సబ్‌ప్లాన్ మండలాల్లోని 672 గ్రామాల్లో 93,877 మంది గిరిజనులు నివ శిస్తున్నట్టు తెలిపారు. మొత్తం 197 జీపీఎస్ పాఠశాలలు ఉన్నాయని.. వాటిలో ఏడు పాఠ శాలలకు పక్కా భవనాలు లేవని చెప్పారు. వీటి కోసం నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. మూతపడిన 13 జీపీఎస్ పాఠశాలలు తెరవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లతో తాగునీరు అందిస్తామన్నారు. మందస మండలంలో రూ.2 కోట్ల 77 లక్షలతో స్పోర్ట్సు స్కూల్ నిర్మా ణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనీమియాతో బాధ పడుతున్న 40 ఏళ్ల లోపు వయసు ఉన్న 75 మందికి పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు. వీరికి విశాఖ కేజీహెచ్‌లో వైద్యసేవలు అందించను న్నట్టు తెలిపారు. గిరి శిఖర గ్రామాల్లో వైద్యసే వలు అందించడానికి 8 ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఆరోగ్య కేంద్రాలకు రూ.6.48లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి మండలా ల్లో పసుపు ప్రాసెసింగ్‌కు రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సెల్‌టవర్లు ఏర్పాటు చేసి.. సిగ్నల్స్ సరిగా అందేలా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. వీటితో పాటు మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

పలాస రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం

పలాస, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఖుర్థారోడ్ డివిజన్ రైల్వే మేనేజర్ హెచ్‌ఎస్ భజ్వా సందర్శించారు. ఫిబ్రవరి 3న పలాస రైల్వేస్టేషన్‌కు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం వస్తున్నందున ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చానన్నారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. జీఎం రెండున్నర గంటల పాటు స్టేషన్‌లో వివిధ విభాగాలు పరిశీలించే అవకాశం ఉందని, ఆ మేరకు మొత్తం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, రోడ్లు, విశ్రాంతి గృహాలు, ప్లాట్‌ఫారాలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట డివిజన్ అధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మరియగిరి యాత్ర

● ఏర్పాట్లు పూర్తి



మరియమాత

వీరఘట్టం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సమీపంలోని యు.వెంకంపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసనం పాల పునీతురాలు మేరిమాత యాత్రా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్స రం జనవరి 30న మరియగిరి యాత్ర జరుగు తుంది. కులమతాలకు అతీతంగా భక్తులు వచ్చి కొబ్బరికాయలు కొట్టి... తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు మేరీమాతను దర్శించుకొనేందుకు కొండపై క్యూలైన్లు ఏర్పాటు చేశారు. యాత్రా ప్రాంగణంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయరాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

పోలీసు బందోబస్తు..

మరియగిరి యాత్రకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బృందాలను నియమించామన్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపాలని భక్తులను కోరారు.

ప్రత్యేక బస్సులు..

ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. దీని కోసం పార్వతీపురం, పాలకొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి రెగ్యులర్ బస్సులతో పాటు అదనంగా మూడు సర్వీసులను నడపనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 7 వరకు బస్సు సర్వీసులు నడుపుతున్నామని వివరించారు. అవసరమైతే మరిన్ని బస్సు సర్వీసులు అందుబాటులోకి తెస్తామని పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. వలంటీర్లను కూడా నియమించామని చెప్పారు.

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● డీపీటీవో విజయకుమార్



యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీపీటీవో విజయకుమార్

అరసవల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కుంభమేళాకు సంబంధించిన కరపత్రాలను/బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద గల కుంభ మేళాకు ఫిబ్రవరి 8వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. మార్గమధ్యలో పూరిలోని జగన్నాథ స్వామి దేవాలయం, కోణార్క్‌లోని సూర్యదేవాలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ ఆలయాన్ని దర్శించు కునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తారు. తిరుగు ప్రయాణంలో కాశీ, గయ, బుద్ధగయను దర్శింపజేసి.. ఈ నెల 14న రాత్రికి శ్రీకాకుళానికి బస్సు చేరుతుందని తెలిపారు. ప్రయాణి కులకు రవాణా సౌకర్యంతో పాటు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 7 రోజుల్లో 7 క్షేత్రాల దర్శనం, భోజన సౌకర్యాలతో కలిపి ఒక్కొక్కరికి రూ.9500 టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో 1, 2వ డిపో మేనేజర్లు అమరసింహుడు, కేవీఎస్ శర్మ, రమేష్, గంగరాజు, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: దట్టంగా కురుస్తున్న మంచు

కప్పేసిన పొగమంచు

కంచిలి/ఆమదాలవలస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా పొగమంచు నగరాలను, పట్టణాలను కప్పేస్తోంది. దీంతో ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. బుధవారం ఉదయం 9గంటల వరకు పొగ మంచు కురుస్తుండడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. గత వారం రోజులుగా కురుస్తున్న మంచుతో మామిడి, జీడిపూతలకు తీవ్ర నష్టం కలగుతుందని రైతులు వాపోతున్నారు.



కంచిలి: పట్టణంలో మంచుతో కప్పేసిన రహదారులు

ద్విచక్ర వాహనంలో మంటలు

ఆమదాలవలస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లెప్రసీ కాలనీ వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. వివరాల్లోకి వెళితే సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన అల్లాడ రాజు ఆ బంకులో పెట్రోల్ కొట్టించాడు. అనంతరం ద్విక్ర వాహనం స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ బంకు సిబ్బంది.. అక్కడ ఉన్న మరికొంతమంది ద్విచక్ర వాహనదారులు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ క్రమంలో అప్రమత్తమై సిబ్బంది ఆ వాహనాన్ని బంకు బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు.



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

సరుబుజ్జిలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో ఎం.పావని కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ప్రతి వలంటీర్ పది మంది నిరక్షరాస్య వయోజనులకు అక్షరాస్యులుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరాజులు, ఎంఈవో శ్రీనివాసరావు, ఏవో ప్రసాదరావు, మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు పేడాడ మణి, మండల కో-ఆర్డినేటర్ రమణబాబు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

లావేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి లావణ్య అన్నారు. బుధవారం మండలం గుమడాంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చూడి పశువుల తనికీలు, గర్భకోశవ్యాధి చికిత్సలు, లేగదూడలకు నట్టల నివారణా మందులు వేశారు. శిబిరంలో సుమారు 250 పశువులకు వైద్యసేవలను అందించినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ యూత్ లీడర్ మజ్జి రామ్మూర్తి, పశువైద్యులు హేమంత్, సిబ్బంది సత్యవతి, ఫీల్డ్‌అసిస్టెంట్ రామసత్యం తదితరులు పాల్గొన్నారు.



మూగజీవికి మందు వేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాతాళసిద్ధేశ్వర ఆలయం సమీపంలో గల జగనన్న కాలనీలో సుమారుగా 700 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాలనీలో రోడ్లు, తాగునీరు సదుపాయాలు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని మాజీ సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం కాలనీ సందర్శించి అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ మీటర్ల కోసం రూ.1900 నుంచి రూ.3000 వరకు తీసుకుంటున్నారని లబ్ధిదారులు తెలిపారని ఈ విషయపై అధికారులు స్పందించాలని కోరారు.

రైల్వే రిజర్వేషన్ సేవలు ప్రారంభం

కంచిలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సోంపేట ఆర్ఎస్ కంచిలి రైల్వే స్టేషన్‌లో సెకండ్ షిఫ్ట్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. సెకండ్ షిఫ్ట్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ గడిచిన నాలుగు నెలలుగా నిలిపివేశారు. కౌంటర్ మళ్లీ ప్రారంభించాలని జడ్ఆర్‌యూసీసీ మెంబరు శ్రీనివాస్, ఎస్‌సీసీ కమిటీ సభ్యులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు రైల్వే అధికారులు స్పందించి మళ్లీ సెకండ్ షిఫ్ట్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. దీంతో రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వేషన్ కౌంటర్‌ను వినియోగించుకోవాలని శ్రీనివాస్ కోరారు.

అతడి నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన రమణమూర్తి

అరసవల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధి ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన జామి రమణమూర్తి(60) బుధవారం మృతి చెందారు. అతని నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్న కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్‌కు తెలియజేశారు. దాంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్స్ పూతి సుజాత, నంది ఉమాశంకర్ కార్నియాను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. తాను మరణించినా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన రమణమూర్తికి రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్ నివాళులర్పించారు.

ఒకటి నుంచి దేవాలయాల వార్షికోత్సవం

గార, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరిపై నిర్మించిన వీర వసంత ఈశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం, లక్ష్మీనరసింహ స్వామి, దత్తాత్రేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు వచ్చే నెల 1నుంచి 3 తేది వరకు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రా రవి కుమార్, వసుంధర దంపతులు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కవిసమ్మేలనం, హరికథ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

9 నుంచి నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు బాపూజీ కళామందిరంలో ముత్యాలమ్మ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు ఉంటాయని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేశిరెడ్డి రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 9న హైదరాబాదుకు చెందిన బీఎం రెడ్డి దర్శకత్వంలో స్వేచ్ఛ నాటిక ప్రదర్శనతో ఈ పోటీలు ప్రారంభమవుతా యమని, అదే రోజు గోపరాజు విజయ దర్శకత్వంలో జనరల్ బోగీలు నాటిక ఉంటుందన్నారు. అదేవిధంగా 10న గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారిచే ఏపూరి హరిబాబు దర్శకత్వంలో చిగురు మేఘం నాటిక, టీవీ పురుషో త్తం దర్శకత్వంలో బ్రహ్మ స్వరూపం నాటిక, 11న విశాఖకు చెందిన చరసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, అదేరోజు రాత్రి సౌజన్య కళా స్రవంతి వారిచే కేకేఎల్ స్వామి దర్శకత్వంలో దేవరాగం నాటిక ఉంటున్నారు.

పుస్తకాల వితరణ

ఎచ్చెర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తెలుగు విభాగానికి డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు బుధవారం పుస్తకాలు వితరణగా అందజేశారు. రూ.50 వేలు విలువ చేసే భాష, సాహిత్య, అనువాద సంబంధిత 150 పైగా పుస్తకాలను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనికి అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

ఆమదాలవలస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గాజులకొల్లివలస, హనుమంతుపురం గ్రామాల్లో పశువైద్య శిబిరాన్ని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ శాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, పశువైద్యులు హేమలత, ఓంకార్, లైఫ్‌స్టాక్ అసిస్టెంట్స్ నవ్య, శ్రావణి దితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి

ఇచ్ఛాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇటుకుల పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కూలీల పిల్లల చదువుల కోసం అన్ని సెంటర్లు వద్ద చదువు చెప్పేందుకు వలంటీర్లను ఏర్పాటు చేయాలని ఇటుకుల పరిశ్రమల యజమానులకు ఎంఈవో అప్పారావు, ఏఎల్ఎస్‌సీవో సమగ్రశిక్ష పి.జనార్దనరావు సూచించారు. బుధవారం జిల్లా టాస్క్ ఫోర్స్ టీం మండలంలో గల అన్ని ఇటుకుల పరిశ్రమలను సందర్శించి చదువులకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్, బ్రెడ్స్ కేఎస్‌సీఎఫ్ కోఆర్డినేటర్, సీఆర్ ఎంటీలు తులసీరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఈదుపురం జడ్పీ హైస్కూల్ (కంద్రవార్డు) హెచ్‌ఎం బి.రామారావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించారు. పిల్లలను బడిక పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు ఆర్.మోహన్‌రావు ఉన్నారు.

థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనను విరమించుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో 3200 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. ఈ ప్లాంట్ నిర్మాణం జరిగితే సుమారు 30 ఆదివాసీ గ్రామాల పరిధిలో గల రెండువేల మంది బాధితులుగా మారిపోతారన్నారు. ఈ ప్రాంతం మొత్తం దుమ్ము, ధూళితో పాటు ప్రజలు వ్యాధుల బారిన పడతారన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆదివాసీలు

వన్‌స్టాప్ కేంద్రంతో మహిళలకు భరోసా

గుజరాతీపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పరువు, పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్లు భరోసానిస్తున్నాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక రిమ్స్ ఆసుప త్రిలో గల వన్‌స్టాప్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఈ కేంద్రాలతో బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించడంతోపాటు న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇస్తూ అండగా నిలవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, చిన్నారుల్లో ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే పోలీసుల సహాయంతో కేసు దర్యాప్తు మొదలు బాధితులకు ఆశ్రయం సైతం కల్పించి, న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇవ్వడం వంటివి పర్యవేక్షిస్తామన్నారు.



వర్సిటీ గేట్ వద్ద చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న వీసీ, ఎస్ఐ తదితరులు

ప్రజా భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

ఎచ్చెర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు యంత్రాంగంతో పాటు ప్రజల చైతన్యవంతమైన భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ పీవో టి.భవానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

బాలికల లింగ నిష్పత్తి పెంచాలి



ఊయలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవిల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బాలికల లింగ నిష్పత్తిని పెంచాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బాలికలను 'రక్షించండి-బాలికలను చదివించండి' కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం ఆడబిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు చైల్డ్ ఇన్సెంటీవ్ కిట్లను 50 మందికి అందజేసి, అక్కడే ఏర్పాటు చేసిన పిల్లల ఊయలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించి క్రీడల్లో గెలుపొందిన 10 మందికి రూ.2500 నగదు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఎంహెచ్‌వో బాల మురళీకృష్ణ, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో యువత ముందుండాలి

ఎచ్చెర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): యువత అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్ జిల్లా (కర్నూలు) ఎన్‌వైకే వలంటర్ల శిక్షణ తరగతుల్లో బుధవారం పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు సాయినాథరెడ్డి, పి.దుర్గాప్రసాద్‌రాజు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు సూచించారు. గంజాయి రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలతో ఉంటారని వారి కళలు సాకారం చేసేలా అడుగులు వేయాలన్నారు.

'విలాసాలకే ఖర్చు చేసిన వైసీపీ ప్రభుత్వం'

అరసవిల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అప్పులు చేసి విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేసి నిధులు తినేశారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. ఈ మేరకు విశాఖ-ఏ కాలనీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.22వేల కోట్లు చంద్రబాబు చెల్లించారని వివరించారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని, ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుది బండలా మారాయన్నారు. ఈ స్థాయిలో బకాయిలు ఉంచి జగన్ తన విలాసవంతమైన భవన నిర్మాణాలకు, జల్సాలకు నిధులు ఖర్చు చేశారని దుయ్యబటారు. బకాయిలు చెల్లిస్తూనే రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు.

బైపాసే నిర్మించాలి



నిరసన తెలుపుతున్న వ్యాపారులు

రణస్థలం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఫ్లైఓవర్ వద్దు.. బైపాసే నిర్మించాలని పలువురు వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారంతా జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా గురువారం చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తూర్పుకాపు సంఘ ఉద్యోగ కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉద్యోగ విభాగం నూతన కార్యవర్గాన్ని సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ నియమించారు. ఈ మేరకు బుధవారం సంఘ కార్యాలయంలో ఏపీటీకేఎస్ఎస్ రాష్ట్ర ఉద్యోగ విభాగ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘ ఉద్యోగ విభాగం గౌరవ అధ్యక్షుడిగా సలాన చిరంజీవి, రాష్ట్ర అధ్యక్షుడిగా బలగ మల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బోనంగి తిరుపతిరావు, పోలాకి మోహన్‌రావు, ఎర్నెన మోహన్, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు.

హాజరు పట్టీలో తప్పులుంటే సరిదిద్దుకోండి

గుజరాతీపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ యాజమాన్యలు మినహా అన్ని యాజమాన్య పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హాజరు పట్టీలో తప్పులుంటే ఆన్‌లైన్ ద్వారా సరిదిద్దుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య తెలిపారు. ఉపాధ్యాయులంతా వ్యక్తిగత అటెండెన్స్‌ను ప్రభుత్వ వైబ్‌సైట్ ద్వారా ఏపీపీ లాగిన్ ద్వారా నమోదు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి మార్పులు ఉంటే ఈ నెల 31వ తేదీ సాయం త్రంలోగా సరిద్దు కోడానికి విద్యాశాఖ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఓపెన్ పరీక్ష కేంద్రాలు మంజూరు చేయాలి

ఇచ్ఛాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాలు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు, బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈమేరకు బుధవారం రామయ్యపుట్టుగలో గల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో ఏడేళ్లపాటు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష సెంటర్ ఉండేది. సుమారు నాలుగేళ్ల కిందట దీన్ని వెత్తివేశారన్నారు. మళ్లీ ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడలతో పాటు చదువులో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 17 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన సింగూరు నందిని, ముంత గాయత్రి, బెండి జ్యోత్స్న రాష్ట్రం తరపున పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ క్రీడకారులను అభినందించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ కేవీ రమణ, కోచ్ మధు తదితరులు ఉన్నారు.

చెస్ పోటీల్లో శృతి ప్రతిభ



శృతి

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆల్‌ఇండియా చదరంగం పోటీల్లో ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బి.శృతికి బంగారు పతకంతోపాటు బెస్ట్ ప్లెయర్‌గా ఎంపిక కావడంపై డీఈవో తిరుమల చైతన్య అభినందించారు. అండర్-14 విభాగంలో పాల్గొన్న శృతి రాష్ట్రం తరుపున పాల్గొని సత్తాచాటింది.

క్రైం కార్నర్

గుజరాత్‌లో ముగ్గురు జిల్లా వాసులు మృతి

● గ్యాస్ మంటలు వ్యాపించి దుర్ఘటన
● స్వగ్రామం ఒంకులూరులో విషాద ఛాయలు

వజ్రపుకొత్తూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం ముంద్రా గ్రామంలో మంగళవారం గ్యాస్‌లీకై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. దీంతో వారి స్వగ్రామం ఒంకులూరు లో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒంకులూరుకు చెందిన లండ రవి (38), భార్య కవిత (31) పదేళ్ల కిందట బతుకు తెరువు కోసం ముంద్రా వెళ్లారు. వారికి మూడేళ్ల కుమార్తె జాహ్నవి ఉంది. రవి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు బయలు దేరాడు. అలవాటు ప్రకారం టీ తాగి వెళ దామని వంటగదిలోకి వెళ్లి గ్యాస్ స్టౌను వెలిగించాడు. ఒక్కసారి గ్యాస్ లీకై ఒక్కసారి మంటలు వ్యాపించి సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న భార్య, కుమార్తెతో పాటు రవి కూడా మంటల్లో చిక్కుకున్నాడు. వెంటనే స్థానికులు మంటలను ఆర్పి వారిని రక్షించేందుకు ప్రయత్నించగా రవి, కుమార్తె పూర్తిగా కాలిపోయి మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న భార్య కవితను అహమ్మదాబాద్ ఆసుపత్రికి తరలించగా అక్క చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్థులు చెప్పారు. ప్రమాద సమయంలో రవి తల్లి శాంతమ్మ పక్కంటిలో ఉండడంతో ప్రాణాలతో బయటపడింది. గ్రామానికి ఎప్పుడు వచ్చినా అందరితో సరదాగా ఉండే లండ రవి కుటుంబం అకాల మరణం కలిచి వేస్తోందని ఒంకులూరు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పిక్కాట, చక్రం ఆటలపై దాడి: రూ.3.20 లక్షల స్వాధీనం

జలుమూరు (సారవకోట), జనవరి 29(ఆంధ్రజ్యోతి): తొగిరి శ్రీ అభయాంజనేయ జాతర సందర్భంగా గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి పిక్కాట, చక్రం ఆటలు వేయడంతో పక్కా సమాచారంతో స్పెషల్ పోలీసు బృందం దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు 19 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3.20 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా జాతరల్లో ఇటువంటి ఆటలు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నగరంలో చోరీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో ఇప్పిలి వెంకటరత్నం అనే మహిళ కుటుంబంతో జీవిస్తోంది. జిల్లా పరిషత్ ఎదురుగా పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి షాపునకు వెళ్లి తిరిగి 6.30 గంటలకు వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం/సోంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మందస, సోంపేట మండలాల సరిహద్దుల్లో ఉన్న బుడార్సింగి పంచాయతీ గుడ్డికోల, బురద సిలగి గ్రామాల్లో బుధవారం 1900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వసం చేసినట్లు సోంపేట ఎక్సైజ్ సీఐ బేబీ తెలిపారు. అలాగే 95 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారా అమ్మినా, రవాణా చేసినా నేరమని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఎస్ డీవీజీ రాజు, సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐ సుజాత, సిబ్బంది రమణ, గాలిబ్, వెంకటేష్, హుస్సేన్, నాయుడు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

పాతపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ వి.రామారావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో జాతీయ రహదారి326ఎపై వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. 30 వాహనాలను సీజ్ చేశామన్నారు. భద్రత మీకే పరిమితం కాదని.. మీ కుటుంబానికి భద్రత అని దీనిని ప్రతి ఒక్కరూ గ్రహించి నిబం ధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కొత్తూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సీఐ చింతాడ ప్రసాద్ తెలిపారు. మహర్తాపురంలో 'సంకల్పం'పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ అమీర్‌ఆలీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమన్నారు.

హెల్మెట్లు ధరించాలి

మెళియాపుట్టి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే టప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. 18 ఏళ్ల నిండని వారికి వాహనాలు ఇవ్వవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

దశ, దిశలను మార్చేది ఇంటర్: ఎంజీఆర్

పాతపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల దశ, దిశ మార్చేది ఇంటర్‌మీడియట్ అని, ప్రణా ళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొ న్నారు.

జిరాయితీ భూముల్లో రోడ్డు వేస్తారా?

● పనులను అడ్డుకున్న రైతులు



రోడ్డును చూపిస్తున్న బాధిత మహిళలు

హరిపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాకు చెందిన జిరాయితీ భూముల్లో నుంచి సముద్ర తీరానికి రోడ్డును వేయడం ఏమిటని బేతాళపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. సముద్ర తీరం వరకు సుమారు 2 కి.మీ రోడ్డు మంంజూరైంది. సర్వే నెం 57/2, 59/6లో సుమారు 6 ఎకరాల నుంచి రోడ్డు నిర్మాణానికి కొలతలు వేసి పను లు ప్రారంభించారు. దీంతో గుంటు మాధవరావు, బైపల్లి పాపమ్మ, గుంటు అంకమ్మలతోపాటు మరో ముగ్గురు రైతులు రెండు రోజులుగా పనులను అడ్డుకుని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మా అనుమతి లేకుండా మా కొబ్బరి, జీడి తోటల్లో నుంచి కాంట్రాక్టర్ దౌర్జన్యంగా పనులు చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ హైమవతిలకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే గౌతు శిరీష న్యాయం చేయాలని సదరు రైతులు కోరుతున్నారు. పనులు కొనసాగిస్తే ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు హెచ్చరించారు.

మెరుగైన వైద్యం అందించాలి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



బాలింతతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీని పరిశీలించారు. ఎంతమంది వైద్యులు వస్తున్నారు, పరికరాలు పని చేస్తున్నాయా లేదా అన్న విషయాలను సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సేవాదృక్పథంతో పనిచేయాలన్నారు. బాలింతలు, జనరల్ వార్డులను సందర్శించి వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తు న్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ చేరువ చేసామన్నారు. ● బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సిరిపురం తేజేశ్వరరావు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిబాబ్జీ, రెడ్డి భాగ్యలక్ష్మి, మెట్ట తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

● ఎమ్మెల్యే శిరీష



పలాస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతకానితనంతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని, రూ.10 లక్షల కోట్లు అప్పు రాష్ట్రంపై భారం పడిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ, ధాన్యం కొనుగోలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల బకాయిలు రూ. 22వేల కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, ఉపాధి హామీతో పాటు పిల్లలకు సరఫరా చేసే చెక్కీలు, గుడ్లు సరఫరా బకాయిలు రూ.1.40 కోట్లన్నారు. గనులు, భూ కేటాయింపులు, సోలార్ కేటాయింపుల్లో రూ.8 లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, జగన్ చేత కాని పరిపాలన వల్ల రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ధాన్యం కొనుగోలు చేయండి

● మంత్రి నాదెండ్లను కోరిన ఎమ్మెల్యే బగ్గు



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సమస్యను విన్నవిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి పెరిగిందని, ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 36వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా పొలాలు, కల్లాల్లోనే ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసేందుకు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వం కొనుగోలుకు నిలిపివేసిందన్నారు. మరో 36వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు అనుమతులివ్వాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే రమణమూర్తి తెలిపారు.

ఆపదలో ఉన్న వారికి అండ: ఎమ్మెల్యే ఎంజీఆర్



సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తెంబూరుకు చెందిన సందపు దుర్యోధనరావుకు రూ. 5,33,624 సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు కాగా ఎల్వోసీ పత్రాన్ని బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందించారు. దుర్యోధనరావు నాలుగున్నరేళ్ల కుమారుడు దిజ్వనంద్ చెవి వినికిడి సమస్యలో బాధపడుతూ వైద్య సేవలకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో సీఎం ఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఈ మొత్తం మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం తన తండ్రి మామిడి అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే గోవిందరావు పూలమాల వేసి నివాళి అర్పించారు.

దివ్యాంగుల ఉపకరణాల నిమిత్తం వైద్య పరీక్షలు



లబ్ధిదారులను పరీక్షిస్తున్న వైద్యులు

టెక్కలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సహా య ఉపకరణాల గుర్తింపు కోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బుధవారం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సీఎస్‌ఆర్ సహకారంతో డివిజన్ స్థాయిలో నిర్వహించిన శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు దివ్యాంగులను పరిశీలించి వారికి అవసరమైన కృత్రిమ అవయవాలను అందించేందుకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఏడీ కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో ఇళ్ల కేటాయింపు: కమిషనర్

పలాస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల కోసం నగదు చెల్లించిన లబ్ధిదారులకు త్వరలో ఇళ్లను కేటాయిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు స్పష్టం చేశారు. బుధవారం కార్యాలయంలో హౌసింగ్ గ్రీవెన్స్ నిర్వహించగా 8 మంది వినతి పత్రాలను అందించారు. ఇళ్ల కోసం బ్యాం కుల నుంచి అప్పులు తీసుకుని మునిసిపాలిటీకి చెల్లించినా నేటివరకు ఇళ్లకేటాయించలేదన్నారు. దీంతో బ్యాంకుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయన్నారు. కమిషనర్ స్పందిస్తూ.. ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామన్నారు.

ఆదివాసీ భూముల్లో వ్యాపార ఆలోచనలు మానాలి

కొత్తూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యాటకం పేరుతో ఆదివాసీ గిరిజన భూములను ఆక్రమించి వ్యాపార ఆలోచనలు చేస్తోందని, వీటిని మానుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. మెట్టూరుగూడ ఆదివాసీ గిరిజన గ్రామ సమీపంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత సమస్యలపై శాసనసభలో చర్చించకుండా గిరిజన భూములను, వారి కొండలను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయిం చడం దారుణమన్నారు. ప్రత్యేక ఐటీడీఏ గాని, గిరిజన గ్రామాల్లో మంచి నీరు, రోడ్లు, వైద్య సదుపాయాలు నోచుకోని గ్రామాలు అనేకం ఉన్నాయని, వాటిపై ప్రభుత్వానికి దృష్టి లేకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సవర జగదీష్, సవర దీపావళి, సవర దశరథ, సవర యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.13.42 కోట్ల పశు నష్టపరిహారం చెల్లింపు

పాతపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశు నష్ట పరిహారం కింద రూ.13,42,52,500 పాడి రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా పశు సంవర్థక శాఖ డీడీ డా.కంచరాన రాజగోపాలరావు తెలి పారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను బుధవారం పరిశీ లించారు. అనంతరం స్థానిక ప్రాంతీ య పశు వైద్యశాలలో విలేకరులతో మాట్లాడుతూ.. 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని సీఎం, పశు సంవర్థకశాఖ మంత్రుల చొరవతో చెల్లించడం జరి గిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలౌతున్న పశుగ్రాసాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశం లో టెక్కలి డివిజన్ డీడీ డా.జయ రాజు, జిల్లా సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం ఏడీ డా.యోగి, పశువైద్యశాల ఏడీ డా. మంచు కరుణాకరరావు, పశుగణాభివృద్ధిసంస్థ వైద్యాధికారి రాధాకుమారి, పశు వైద్యాధికారి డా.పి.అనిల్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

వజ్రపుకొత్తూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి శాఖ డీడీ డాక్టర్ సత్యప్రకాశ్ అన్నారు. బుధవారం పెద్దబొడ్డపాడులో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వ్యవసాయంలో దుక్కికి పశువుల అవసరం తగ్గిందని, ప్రస్తుతం పాడి పశువుల పోషణపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఏడీ డాక్టర్ రవికృష్ణ, మండల పశువైద్యాధికారి మెట్ట పాపారావు, ఉపసర్పంచ్ దుంపల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలోనే ఎక్కువగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు

టెక్కలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పెద్దఎత్తున సాగుతోంది. జిల్లాలో ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో కానివి ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతుండడంతో ఎక్కువ మంది ఇక్కడి నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఇక్కడ రోజుకి 15 నుంచి 18 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా వాటిలో ఒకటో, రెండో ఎనీవేర్ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌లు ఉంటున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లోతుగా పరిశీలిస్తే కొన్ని తప్పిదాలు కనిపిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఈ ప్రక్రియకు ఒకరిద్దరు దళారీలు ఈ కార్యాలయంలో మకాం వేసి చేయిస్తున్నారని, పెద్దఎత్తున చేతివాటం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో క్రయ విక్రయదారులు ఎవరూ స్థానికులు కాకపోవడం విశేషం. ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ ఎం.ఉమామహేశ్వర రావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఈ జిల్లాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జిల్లాలో ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చ న్నారు. జిల్లాలో మిగిలిన కార్యాలయాల్లో జరిగిన ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల కంటే టెక్కలిలో చాలా తక్కువన్నారు. దళారీ ప్రశ్నే లేదని, బుధవారం హరిపురం నుంచి యోగేశ్వరరావు రెండు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధనా కృత్యాలు

● జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు




చిన్నారుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు

హిరమండలం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ఆకట్టుకునేలా బోధనా కృత్యాలు చేపట్టాలని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు అన్నారు. గులుమూరు ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదన ఉండడంతో ఆయన వచ్చి పాఠశాలలోని మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఎంపీడీవో కాశీ ప్రసాదరావు, ఎంఈవో రాంబాబు పాల్గొన్నారు.

పంచాయతీల్లో మోడల్ పాఠశాలలు

ఎల్.ఎన్.పేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో మోడల్ పాఠశాలల ఏర్పాటుకు గాను ప్రభుత్వ నిబంధనల మేరకు నివేదికలను అందించాలని జడ్పీ సీఈవో వీఎస్ ఎల్ఎన్ శ్రీధర్ రాజు ఆదేశించారు. చింతలబడవంజ, పూశాం, జాడుపేట తదితర గ్రామాల్లోని పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థులు హాజరు పట్టికలను పరిశీలించారు. జీవో 117 ఉపసంహరణకు సంబంధించి పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు పట్టికల మేరకు మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ స్కూల్స్ ను కొత్తగా ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ పాఠశాలలు నడిపేందుకు వీలులేని వాటిని ఎప్పటి లాగే పాఠశాలలు కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి. శ్రీనివాసరావు, ఎంఈవో-2 కె. చంద్రమౌళి పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలందించాలి: డీపీఎంవో



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు సకాలంలో వైద్య సేవలందించి వారి మన్ననలను అందుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం (డీపీఎంవో) అధికారి రవీంద్ర అన్నారు. తురకపేట పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించి సిబ్బంది పని తీరును పర్యవేక్షించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డీపీహెచ్ఎన్‌వో శైలజ, డీపీవో మురళి, వైద్యాధికారి ఎ.లక్ష్మీదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న 'చలో హైదరాబాద్'

కాశీబుగ్గ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు తేజేశ్వరరావు, అప్పలరాజు, జోగారావు, కృష్ణారావు కోరారు. ఈ మేరకు బుధవారం 12వ వార్డు ఎస్సీ వీధిలో మాదిగ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టును వెంటనే ప్రభుత్వానికి అందజేయాలన్నారు. దీనిపై ఫిబ్రవరి 7న 'వేయి గొంతులు, లక్ష డప్పులు' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతి నిధులు చంద్రయ్య, నేతాజీ, జి.దానయ్య, అప్పలస్వామి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు రెండు మద్యం దుకాణాలు

టెక్కలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కల్లుగీత సామాజిక కులాలకు రెండు మద్యం దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని సీఐ ఎస్‌కే మీరాసాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెగిడి కులస్థులకు టెక్కలిలో, నందిగాం మండలంలో శ్రీశైన కులస్థులకు ఒక్కో మద్యం దుకాణం చొప్పున కేటాయిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆసక్తి ఉన్న ఆయా కులాల అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండి తమ నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను జత పరుస్తూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో దర ఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు చలానా తీయాలని, ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న లాటరీ ద్వారా ఎంపిక జరుగు తుందని, ఇతర వివరాలకు 94925 43354 నెంబరులో సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

నందిగాం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పంచాయతీ కృష్ణరాయపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వేపపోలమ్మతల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

హరిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అనకాపల్లి జిల్లా సీపీవో గేదెల రామారావు కోరారు. బాహాడపల్లి హైస్కూల్ విద్యార్థు లకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన వ్యక్తి సీపీవో రామారావు అని, విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

సంతబొమ్మాళి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పాలపోలమ్మతల్లి ఆలయం ఐదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. వేద పండితులు బూరాడ శ్రీనివాస శర్మ, ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో గ్రామా నికి చెందిన పలువురు మహిళలు ఈ ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రయాణికుల క్షేమం డ్రైవర్ బాధ్యత

టెక్కలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల క్షేమమే డ్రైవర్ బాధ్యత అని ఎంవీఐ ఎం. సంజీవరావు అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ గ్యారేజ్‌లో 'శ్రద్ధ వహించండి' కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత అనేది నిరంతర ప్రక్రియ అని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి ప్రమా దాలను తగ్గించాలన్నారు. టెక్కలి సీఐ ఎ.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రయాణి కుల క్షేమమే ధ్యేయంగా డ్రైవర్లు వాహనా లను నడుపుతూ గమ్యానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాస రావు, నాగభూషణం, మురళీమోహన్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

రేపు మెగా పశు వైద్యశిబిరం

పోలాకి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గాతలవలస పంచాయతీ కొండకొత్తపేట గ్రామంలో శుక్రవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, ఎంపీటీసీ వై.లక్ష్మణరావు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభిస్తారన్నారు. జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజల ఆస్తులను రక్షించండి

పలాసరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆస్తులు, చెరువు, కొండలను ఆక్రమణల నివారించి వాటిని సంరక్షించాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆక్రమణలు ఆగాయని, గత పాలనలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పార్టీ నాయకులు హరీష్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణారావు ఉన్నారు.

పథకాలివ్వలేమనడం దారుణం

పలాస, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పథకాలు అమలు చేస్తామని చెప్పిన టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు సీఎం అయిన తరువాత ఇప్పుడు హామీలను నెరవేరలేమని, పథకాలు ఇవ్వలేమని చెప్పడం దారుణమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి అప్పలరాజు నివాసంలో ఆయనతో కలిసి విలేకరుల సమావేశంలో మాటాడారు. ఎన్నికల హామీలను మాయంచేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు వైసీపీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పేరాడ తిలక్, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, పైల చిట్టి, బల్లయ్య పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా చర్యలు

మెళియాపుట్టి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలకు వారం రోజులుగా కలుషితమైన నీరు వస్తుండడంతో ఇబ్బందులుపడుతున్న విషయం తెలిసిందే. సమస్య ఇప్పటికీ పరిష్కారం కాక పోవడంతో ముస్లిం వీధి మహిళలతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎక్స్‌కవేటర్‌తో కాలువ నీటిని తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతానని తెలి పారు. ఎంపీడీవో ప్రసాద్‌పండా, పంచాయతీ కార్యదర్శి అప్పారావు విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు.

ధ్రువపత్రాలకు ప్రత్యేక డ్రైవ్

పలాసరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రజలు జనన, మరణ ధ్రువపత్రాలు పొందని వారి కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో గ్రంధి వెంకటేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాల యంలో డివిజన్ స్థాయిలో స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు తహసీల్దార్లు కల్యాణ చక్రవర్తి, హైమవతి, ఆర్ఐలు పాల్గొన్నారు.